ప్రశాంతంగా ఎపిఇఎపి సెట్ పరీక్ష

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ఆదిత్యలో నిర్వహిస్తున్న ఎపిఇఎపి సెట్ ఆన్‌లైన్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. 2వరోజు ఉదయం ఆదిత్య యూనివర్సిటీలో 240 గాను 223, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 294 గాను 274 హాజరయ్యారని వివరించారు. అలాగే సాయంత్రం ఆదిత్య యూనివర్సిటీలో 240 గాను 231 మంది, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 295 గాను 271 మంది హాజరయ్యారని తెలిపారు. ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షం కురవడంతో ఆర్‌టిసి బస్సుల్లో వచ్చిన విద్యార్థులకు మెయిన్ గేట్ నుంచి పరీక్షా కేంద్రాలకు ఆదిత్య బస్సుల్లో తరలించినట్లు ఆయన తెలిపారు.

తల్లీబిడ్డ సేవలెలా..?

- డ్రైవర్లకు అరకొర వేతనాలే దిక్కు
- మూడు నెలలుగా పెండింగ్
- పెట్రోలు కొరతతో సేవలకు ఆటంకం
- సమ్మె బాటలో సిబ్బంది

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం అనంతరం తల్లీ, బిడ్డలను సురక్షితంగా, సౌకర్యవంతంగా ఇంటికి చేర్చేందుకు తీసుకువచ్చిన తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అరకొరగానే అందుతున్నాయి. ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వల్ల పేద, సామాన్య వర్గాలకు ఎంతో ఉపయోగపడుతున్న ఈ వాహనాలను కనీసంగా మరమ్మతులు చేయించడం లేదు. చివరకు పెట్రోలు బిల్లులు సైతం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని సిబ్బంది వాపోతున్నారు.

తల్లీ బిడ్డల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 2016 జనవరిలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పిహెచ్‌సి నుంచి జిల్లా ఆసుపత్రి వరకు ప్రభుత్వ ఆసుత్రుల్లో ప్రసవమైన తల్లీ బిడ్డ, వారితో ఉన్న కుటుంబ సభ్యులను ఉచితంగా వారింటికి క్షేమంగా చేరవేయడమే ఈ పథకం లక్ష్యం. ఉమ్మడి జిల్లాకు 31 వాహనాలు మంజూరు చేశారు. ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాకినాడకు 8, రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వాసుపత్రికి 5, తుని, అమలాపురం రెండేసి, పిఠాపురం, రౌతులపూడి, రామచంద్రపురం, తాళ్లరేవు, రాజోలు, కొత్తపేట, పెద్దాపురం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, రంపచోడవరం, అడ్డతీగల, చింతూరు, కూనవరంలో ఒక్కో వాహనం సేవలు అందిస్తున్నాయి. రోజుకి కనీసంగా 90 వరకు తల్లీబిడ్డలను ఇళ్లకు చేరుస్తున్నాయి.

అరకొర వేతనాలు ఆపై పెండింగ్

రోజురోజుకీ నిత్యవసరాలు వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో పేదలు, సామాన్యులు బతకాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఔట్ సోర్సింగ్ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు అరకొర వేతనాలను మాత్రమే ప్రభుత్వం ఇస్తుంది. వీటితో ఏ విధంగా కుటుంబాలను పోషించుకోవాలంటూ ఆయా వ్యవస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అందిస్తున్న డ్రైవర్లకు కేవలం నెలకు రూ.7,800 మాత్రమే వేతనం ఇస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నెలకు కనీసంగా రూ.30 వేలు ఉంటేనే గాని కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేదు. గత 8 ఏళ్లగా తక్కువ వేతనాలతో జీవనం సాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని అనేకసార్లు విన్నవించినా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదంటూ ఈ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 3 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు సైతం పుట్టక ఇబ్బందులు పడుతున్నామని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణపై నిర్లక్ష్యం

ఈ వాహనాల నిర్వహణను 2021 డిసెంబరు 31 వరకూ జివికె సంస్థ నిర్వహించింది. 2022 జనవరి 1 నుంచి అరబిందో నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. కానీ సంస్థ నిర్లక్ష్యం కారణంగా ఈ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదంటూ పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ నెలకు రెండు సార్లు మాత్రమే కొట్టించుకోవాలంటూ సంస్థ చెబుతుండడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బంది తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వలన ప్రస్తుతం 8 వాహనాలు మూలన పడ్డాయి. కాకినాడ జిల్లా కేంద్రంలో ఉన్న జిజిహెచ్‌లో 14 వాహనాలు ఉండగా 7 గురు మాత్రమే డ్రైవర్లున్నారు. దీంతో ఉన్న వారిపైనే ఒత్తిడి పెరుగుతోంది. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. అందుకే సంస్థలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఒకరోజు సమ్మె చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు.

ప్రభుత్వమే వేతనం ఇవ్వాలి

102 తల్లీబిడ్డ వాహనాలను ప్రభుత్వం నేరుగా నడిపి డ్రైవర్లకు ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి డ్రైవర్ల అందరిని పర్మినెంట్ చేయాలి. చట్టప్రకారం వీక్లీ ఆఫ్, పండుగలు, జాతీయ శెలవులు అమలు చేయించాలి.

- వల్లూరి కుమార్, డ్రైవర్, కాకినాడ జిజిహెచ్

వెట్టి చాకిరీ చేయిస్తున్నారు

తల్లీబిడ్డ వాహనాలపై పనిచేస్తున్న డ్రైవర్ల చేత 12 గంటలు డ్యూటీ చేయించుకుని కేవలం రూ.7,800 ఇవ్వడం దారుణం. చట్ట ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలి. 8 గంటల పని దినాలు అమలు చేయాలి. డ్రైవర్ల అందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వమే నిర్వహణ బాధ్యత తీసుకోవాలి.

- మలకా వెంకటరమణ, సిఐటియు జిల్లా కోశాధికారి, కాకినాడ

కనీస వేతనం ఇవ్వాలి

పెండింగులో ఉన్న బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలి. కనీస వేతనం రూ.18,500 చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. యజమాని వాటా పిఎఫ్ ను యాజమాన్యమే చెల్లించాలి. ప్రతి సిబ్బందికీ ఇఎస్ఐ చెల్లించాలి.

-పి.సాయి, అధ్యక్షుడు, ఎపి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్

కలెక్టరేట్ వద్ద వర్షంలో ధర్నా చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు రావాల్సిన బకాయి జీతాలను తక్షణమే చెల్లించాలని కలెక్టరేట్ వద్ద మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయిన తరువాత తల్లిని బిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చడంలో తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు కృషి చేస్తున్నారని అన్నారు. నిబద్ధతగా విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లకు జీతాలు మాత్రం ప్రభుత్వం చిత్తశుద్ధితో చెల్లించడం లేదన్నారు. నెలకు రూ.7800 వేతనం ఇస్తున్నారని, ఆ వేతనాన్ని సైతం సక్రమంగా అందివ్వడం లేదన్నారు. గత మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నెలతో కాంట్రాక్ట్ గడువు ముగుస్తున్న తరుణంలో ఈ వ్యవస్థను ప్రభుత్వమే నేరుగా నిర్వహణ చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. తొలుత డ్రైవర్లు జిజిహెచ్ వద్ద గల తల్లి బిడ్డ విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ ఎస్.సాయికుమార్, వి.మల్లికార్జునరావు, బి.చిన్న బాబు, వి.కుమార్, బి.సుభాష్, ఎం.రమణ, విజయ్, శంకర, నరేష్, సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఇవిఎంల భద్రతకు చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

ఇవిఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఇవిఎం, వివిపాట్స్ భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఇవిఎం గోదామును కలెక్టర్ షాన్‌మోహన్ రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఇవిఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎం, వివిపాట్స్ భద్రతకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఇవిఎం గోదాము భద్రతను తనిఖీ చేసి, నివేదిక పంపిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమం అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటి ఎం.జగన్నాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న కార్మికులు

14వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో కార్మికులు నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. తమకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని ఇంజనీరింగ్ కార్మికులు డిమాండ్ చేశారు. మండల సిఐటియు, ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళ వారం సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ తమ న్యాయబద్ధమైన కోర్కెలను తీర్చాలని ఇంజనీరింగ్ కార్మికులు గత 14 రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి ఇంజనీరింగ్ కార్మికుల డిమాండ్లపై యూనియన్ నాయకులతో చర్చించి చట్ట ప్రకారం కార్మికులను న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.శ్రీనివాస్, డి.కృష్ణ, సిహెచ్. సత్యనారాయణ, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చింతల సత్యనారాయణ, తాడిశెట్టి గంగ, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోసం ధర్నా

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నా జరిగింది. సిఐటియు, ఇతర ప్రజాసంఘాల నేతలు ఈ ధర్నాలో పాల్గొని తక్షణమే లుఏబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ వద్ద కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ స్థానిక కలెక్టరేట్ వద్ద కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగిది. ఈ సందర్భగా కార్మికుల మెడకు ఉరితాడైన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీసం రూ.26 వేలు వేతనం చెల్లించాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి రెగ్యులరైజేషన్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియుసి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కార్యనిర్వహక కార్యదర్శి తాళ్లూరు రాజు డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లను పరిశ్రమల యాజమాన్యాలకు, కార్పొరేట్లకు, మోడీ ప్రియ మిత్రులకు లాభదాయకమని, దేశంలో కష్టించి పనిచేసే 90 శాతం మందికి ఉరితాడు వంటివని అన్నారు. జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె చేసి ఈ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఉద్యోగులు, కార్మికులు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మలకా రమణ, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, టి రాజా, ఎపి మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకట్రావు, ఆశా వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి భారతి, ఆటో వర్కర్స్ యూనియన్ ప్రకాశరావు, పెంక్షనర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్తిరాజు, ఏఐఎ జిల్లా ఉపాధ్యక్షురాలు రాణి పాల్గొన్నారు. అలాగే జిజిహెచ్ మాతాశిశు విభాగం వద్ద శానిటేషన్ వర్కర్స్ ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.విజయ్‌కుమార్, జె.శేషు, ఎస్.వాసు, డి.దుర్గాప్రసాద్, ఎం.రవి, డి.జనార్ధన్, భాగ్యవతి, వసంత్ జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అనపర్తి ఏడుకొండలు, సెక్యూరిటీ యూనియన్ నాయకులు సోమరాజు, ఆదినారాయణ పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** వలస పాకల సెంటర్లో సిఐటియు, ఐఎఫ్‌టియు, సివిల్ అండ్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, సిఐటియు కాకినాడ రూరల్ కార్యదర్శి టి.రాజా, సివిల్ అండ్ మెకానిక్ యూనియన్ అధ్యక్షులు రాము మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్, రాంబాబు, ఐఎఫ్‌టియు నాయకులు కె.నరసింహ, రామకృష్ణ, రాఘవ, మహేష్, బంగార్రాజు, విజయ్, రాజేష్ పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. అనంతరం కార్యాలయ ఎఒ కాంతారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు స్నేహలత, సావిత్రి, రత్నం, చింతల సత్యనారాయణ, తాడిశెట్టి గంగ, లోవకుమారి, సత్య, కరక సుబ్బలక్ష్మి, గాడి సత్యవతి, ఎన్ సూరిబాబు, ఎస్ శ్రీనివాసు, కృష్ణ, అరుణ్ పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. కార్యాలయ ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, రాయుడు నాగలక్ష్మి, వెయ్యల అనంతలక్ష్మి, లంక విమలాదేవి, కె.విజయలక్ష్మి, దుప్పి అదృష్టదీపుడు, గోడి భాస్కరరావు పాల్గొన్నారు. **జగ్గంపేట** తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆశా వర్కర్లు రాజపూడి సిహెచ్‌సి వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భగా ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు మంగ మాట్లాడుతూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **కోటనందూరు** కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ప్రజా సంగాల ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.పద్మ, రవాణా యూనియన్ నాయకుడు మాడెం బాబూరావు, ఆశ యూనియన్ నాయకులు మర్యారత్నం, వెంకటలక్ష్మి మాట్లాడారు. అనంతరం స్థానిక తహశీల్దార్ టి.సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ, బిల్డింగ్ వర్కర్స్, మిడ్డే మీల్స్ యూనియన్ల నాయకులు బొజ్జా నూకరాజు, బాబ్జి, సత్యవతి, దేవుడమ్మ, దుర్గ, అప్పలనర్స, నూకరత్నం, అపర్ణ, సత్యవతి, లోవ, కుమారి, ఫాతిమా, కుసుమ, పాల్గొన్నారు. **కిర్లంపూడి** సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టి.జీవా, సిహెచ్.రత్నం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆశా వర్కర్ల ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, పద్మావతి మాట్లాడారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియ నాయకులు కె.నాగేశ్వరరావు, వై.అక్కయమ్మ, రాజేశ్వరి, అనంతకుమారి, తదితరులు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి కెవిపి.సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుర్రాల అప్పారెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ మండల కార్యదర్శి సిహెచ్‌ఎస్.కుమార్, ఎం.లక్ష్మి, జి.మంగారత్నం, తదితరులు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మండల రెవెన్యూ కార్యాలయం వరకూ సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పోసపల్లి రమణ, సిహెచ్.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. **తుని** పట్టణంలో సిఐటియు మండల కార్యదర్శి నక్కల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ హైస్కూల్ సెంటర్లో కార్మికులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో గొర్ల వెంకటరమణ, సుబ్బలక్ష్మి, చిట్టిబాబు, నూకరాజు, శాంతకుమారి, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో ధర్నా చేస్తున్న ఆశాలు, అంగన్‌వాడీలు

కాకినాడ రూరల్‌లో సిఐటియు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో రాస్తారోకో

కిర్లంపూడిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



'శ్రీవిద్య'లో విలువలతో కూడిన విద్య

ప్రజాశక్తి - ఏలేశ్వరం

విలువలతో కూడిన విద్యను అందిస్తూ గత 22 సంవత్సరాలుగా ఏజెన్సీ ముఖ ద్వారమైన ఏలేశ్వరంలో దినదినాభివృద్ధి చెందుతున్న ఏకైక విద్య సంస్థగా 'శ్రీవిద్య' విద్యా సంస్థ పలువురి మన్ననలు పొందుతుంది. ఈ సంస్థలో చదివిన విద్యార్థులు డాక్టర్లు గాను, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, రైల్వే ఇతర అత్యున్నత ఉద్యోగాలు పొందడం విశేషం. ఏలేశ్వరంలో ఆంగ్ల మీడియం విద్య అందని ద్రాక్షగా ఉన్న తరుణంలో శ్రీవిద్య సంస్థ ప్రారంభించి ఎంతోమంది విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించిన ఘనత శ్రీవిద్యా విద్యా సంస్థకే దక్కుతుంది.

లాభాపేక్ష చూసుకోకుండా పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలకు తక్కువ ఫీజులతో నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్య అందించాలనే లక్ష్యంతో 'శ్రీ విద్యా' సంస్థను ప్రారంభించాం. కేవలం 45 మంది విద్యార్థులతో అద్దె భవనంలో ప్రారంభించిన అనతి కాలంలోనే తమ సంస్థ దినదిన అభివృద్ధి చెందుతూ సొంత భవనం సమకూర్చుకునే స్థాయికి ఎదిగింది. తమ ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రులు నమ్మకం తమ సంస్థకు పెట్టుబడి అన్నారు.

- టివి.వేణి కరస్పాండెంట్

10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను చాటిన విద్యార్థులు

ప్రస్తుత కార్పొరేట్ యుగానికి ధీటుగా విద్యను అందిస్తూ ప్రతి సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో తమ సంస్థ అత్యున్నత ఫలితాలను సాధిస్తుంది. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, బోధనా పద్ధతుల్లో అధునాతన సాంకేతికత పాటించడం తమ పాఠశాల ప్రత్యేకత. తమ పాఠశాల విద్యార్థులకు చిన్నతనం నుంచి చదువుతోపాటు, కంప్యూటర్, గేమ్స్, వ్యాయామం, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణను ఇస్తూ ప్రోత్సహిస్తున్నాం.

-టి.దమయంతి, ప్రిన్సిపల్

ప్రత్యేకతలు

- ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్‌లు
- అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో బోధన
- విశాలమైన తరగతి గదులు
- సువిసాల మైన క్రీడా ప్రాంగణం
- దూర ప్రాంత విద్యార్థులకు సైతం బస్సు సౌకర్యం
- ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ
- అబాకాస్ విధానంలో లెక్కలు బోధన
- ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రోగ్రెస్‌పై చర్చ
- సిబిఎస్‌సి విధానంలో విద్యాబోధన

ఆసక్తికరంగా వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం, కాకినాడ

సామర్లకోట శిబిరంలో విద్యార్థులు

సామర్లకోట గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. విద్యార్థులు చదరంగం, చిత్రలేఖనం వంటి విషయాల్లో ఆసక్తి కలిగి మేధాశక్తిని పెంపొందించుకోవాలని సామర్లకోట గ్రంథాలయ అధికారిని బందిల రత్నామని పిలుపునిచ్చారు. విద్యార్థినీ, విద్యార్థులకు మంగళవారం చదరంగం, చిత్రలేఖనంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చదరంగం ఆటపై యార్లగడ్డ రాజేష్, డ్రాయింగ్‌పై కొల్లి పెద్దిరాజు, మ్యాథ్స్‌లో కొమ్ము శివశేఖర్ అవగాహన కల్పించారు. నీతి కథలు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిని బందిల రత్నమణి తెలిపారు. అలాగే పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు తెలుగు గ్రామర్‌పై ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదవడం, కథలు చెప్పడంలో అవగాహన కల్పించారు. కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వన్ టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎన్.రాజబాబు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. అనంతరం జనరల్ నాలెడ్జిపై క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ ఇన్‌ఛార్జ్ అధికారి కె.కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బంగారం, వెండి ఆభరణాల చోరీ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గుర్తుతెలియని వ్యక్తులు తిరిగి తాళాలు పగలగొట్టి బండారు, వెండి నగలు చోరీ చేశారు. ఈ ఘటన కపిలేశ్వరపురం లో జరిగింది. స్థానిక వైయస్సార్ కాలనీలో నివాసం ఉంటున్న ఎం.పోసియ్య నాగమణి దంపతులు ఇటీవల వేరే ఊరికి వెళ్లారు. సోమవారం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని చూసి అంగర పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రూ.లక్ష విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైయున్నట్లు వారు తెలిపారు.

గాయపడిన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గాయాల పాలైన వద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాజమహేంద్ర వరం ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. మంగళవారం పోలీసుల వివరాలు ప్రకారం మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన యార్లగడ్డ ముసలయ్య (78) ఈనెల 8న తన ఇంట్లో వంట చేసుకుంటున్నాడు. ఈ సమయంలో గ్యాస్ పొయ్యి నుండి మంటలు చెలరేగి శరీరం కాలిపోయి ముసలయ్యకు గాయాలయ్యాయి. అతని కుమారుడు వీర్రాజు హుటాహుటిన ముసలయ్యను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుండి చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ముసలయ్య సోమవారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలోని మందపల్లి సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందినట్లు కొత్తపేట ఎస్ఐ జి. సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కమ్మిరెడ్డి పాలెం కు చెందిన వాడ చైతన్య జనార్ధన(33) సోమవారం రాత్రి రావులపాలెం వెళ్లి తిరిగి 1.45 గంటలకు వస్తున్నాడు. ఈ సమయంలో మందపల్లి వంతెన సమీపంలోని కళ్యాణి సోం పాపిడి స్వీట్ షాపు ఎదురుగా జనార్ధన మోటార్ సైకిల్ ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా విక్రేతపై పీడీ యాక్ట్

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గిడజం గ్రామానికి చెందిన సారా విక్రేత గొలుసు లక్ష్మిపై పీడీ యాక్ట్‌ను నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పట్టాభి చౌదరి తెలిపారు. ఇప్పటికే ఆమెపై ఐదు కేసులు ఉన్నాయని, సారా అమ్మకాలు చేయవద్దని ఇటీవల ఆమెను హెచ్చరించినా మార్పు రాకపోవడంతో ఆమెపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఇకనుండి ఎవరైనా సారా అమ్మకాలు చేసినట్లయితే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడ పోర్ట్‌లోని రైస్ మిల్లులో పనిచేస్తున్న సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన నక్క నాగేంద్ర మంగళవారం బొలెరో వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. అయితే క్షతగాత్రుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్ వాహనం రావడంలో ఆలస్యం కావడంతో ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని పోలీస్ వాహనంలో ఎక్కించుకుని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం పై కేసు నమోదు చేసి స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సమయస్ఫూర్తితో క్షతగాత్రుని తన వాహనంలో ఆసుపత్రికి తరలించిన ట్రాఫిక్ ఎస్ఐని పలువురు అభినందించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక టవర్ కాలనీ వద్ద నిర్వహించిన పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి, ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం తెల్లవారుజామున తన సిబ్బందితో దాడి చేసి, వారి నుంచి రూ.6,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో తీపర్రు గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. బాలిక ఈ నెల 19వ తేదీ రాత్రి కాలకృత్యాల నిమిత్తం బయటకు వెళ్లిందన్నారు. అప్పటి నుంచి తిరిగి రాలేదని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు బాలిక వివరాలు తెలిస్తే 9440796642, 9154875611 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

మత్స్యకార యువకుడు గల్లంతు

గాలింపు చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకార యువకులు బోటు బోల్తా కొట్టడంతో ఒకరు గల్లంతవ్వగా మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటనపై అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సముద్ర తీరంలో వేట నిషేధం ఆంక్షలు ఉన్నప్పటికీ ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన ముగ్గురు మత్స్యకార యువకులు మెరుగుశ్యామ్ (19), వంక ఇసాక్(35), రామిశెట్టి వీరబాబు(35) సోమవారం అర్ధరాత్రి బోటుపై వేటకి వెళ్లారు. సముద్రపు అలలు తీవ్రంగా ఉండడంతో హోప్ ఐలాండ్ సమీపంలో బోటు బోల్తా కొట్టి సముద్రంలో యువకులు పడిపోయారు. వీరిలో వంక ఇసాక్, రామిశెట్టి వీరబాబు ఈదుకుంటూ హోప్ ఐలాండ్ చేరుకోగా, మెరుగు శ్యామ్ ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న అధికారులు గల్లంతయిన శ్యామ్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

మినీ మహానాడులో పలు తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి - పిఠాపురం

ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

స్థానిక మున్సిపల్ కల్యాణ్ మండపంలో మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో జరిగిన మినీ మహానాడు పలు తీర్మానాలు చేశారు. తొలుత టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పురుషోత్తపట్నం ఎత్తి పోతల పథకాన్ని తిరిగి ప్రారంభించి నందుకు నియోజవర్గ రైతాంగం, టిడిపి తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైసిపి పాలనలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని, గత టిడిపి పాలనలో నిర్మించిన గృహాలకు బిల్లుల బకాయిలు చెల్లించాలని పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాలలో గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన లే - అవుట్‌లలో అక్రమాలను గుర్తించి, ఖాళీగా ఉన్న నివేశ స్థలాలను గుర్తించి, అవసరమైతే కొత్తగా భూ సేకరణ చేపట్టి, నిరుపేదలకు కేటాయించాలని తీర్మానించారు. వివిధ గ్రామాలు, పట్టణాలలో అనుమతులు పొంది, పనులు ప్రారంభించిన 28 కాపు, బిసి, ఎస్‌సి, ముస్లిం సామాజిక వర్గాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని, వాటికి కేటాయించిన స్థలాలు పరిరక్షించాలని తీర్మానం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని, వివిధ సంక్షేమ పథకాలలో నియోజకవర్గంలో టిడిపి కుటుంబ సభ్యులకు కేవలం 33 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని, వీటిని మిగిలిన నియోజకవర్గాల మాదిరి 50 శాతంగా సవరించి మిగిలిన శాతాన్ని ప్రభుత్వం నుంచి నేరుగా కేటాయించి కార్యకర్తలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పి.గణేష్‌కుమార్, మాజీ జడ్‌పిటిసి సభ్యులు తోట నవీన్, వాసిరెడ్డి యేసుదాసు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టత కోసం కృషి : ముద్రగడ

ప్రజాశక్తి - కిర్లంపూడి

నియోజకవర్గంలో వైసిపిని పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని వైసిపి రాజకీయ సలహాదారులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. మంగళవారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో రౌతులపూడి మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి వైసిపిని వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. రౌతులపూడి మండలం నుంచి రాష్ట్ర, నియోజకవర్గ, మండల స్థాయిలో వివిధ పదవులను పొందిన వారు మరింతగా కష్టపడి పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజలకు మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నేడు ఆ హామీలను తుంగలో తొక్కుతుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. నూతనంగా పదవులు పొందిన వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం తోపాటు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొల్లు చిన్నదివాణం, చింతకాయల సత్యనారాయణ, వాసిరెడ్డి జమీల్, వాసిరెడ్డి భాస్కర్‌బాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సిఎంఆర్ఎఫ్ నుంచి విడుదలైన చెక్కులను మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి పంపిణీ చేశారు. మంగళవారం వారి స్వగృహంలో సిఎం సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. కరప మండలంలో అరట్లకట్ట గ్రామానికి చెందిన యారామాటి లక్ష్మికి రూ.25,100, వేలంగి గ్రామానికి చెందిన పెంకె రామకృష్ణకి రూ.43,843, పెనుగుదురు గ్రామానికి చెందిన గుత్తుల వెంకటరావుకి రూ.32,889, రూరల్ మండలంలో తూరంగి గ్రామానికి చెందిన చొక్కా ఎల్లయ్యకి రూ.20,350, సూరాడ మల్లీశ్వరికి రూ.40 వేలు, గైగోలుపాడు గ్రామానికి చెందిన గంజా శ్రీనివాస్‌కి రూ.33,752, ఇంద్రపాలెం గ్రామానికి చెందిన అనుసూరి వెంకటరమణకి రూ.64,415, వాకలపూడి గ్రామానికి చెందిన కొండెల లక్ష్మికి రూ.20 వేలు మొత్తం రూ.2,80,349 విలువ చేసే చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అర్హతే ప్రామాణికంగా సిఎం ఆర్ఎఫ్ విడుదల అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పుడు ప్రకటనలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజాశక్తి ప్రతినిధి ముమ్మిడి లక్ష్మణ్‌ను కించపరుస్తూ, అవమానకరంగా, తప్పుడు ప్రకటనలు ఇచ్చిన వారిపై పోలీసులు వెంటనే చర్య తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషబాబ్జి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మట్టి మాఫియాపై పోరాడుతున్న రైతుల వార్తల కవరేజీ ఇస్తున్నందుకు ఓర్వలేక ఆయనపై కక్షగట్టారన్నారు. అందులో భాగంగానే కించపరుస్తూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఆయన నకిలీ విలేకరి అంటూ మట్టి మాఫియానే ప్రచారం చేస్తుందన్నారు. 20 ఏళ్లుగా ఆయన అదే పత్రికలో సేవలందిస్తున్నారని తెలిపారు. ఆయనపై ఎవరో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు, ఆయన్ని అరెస్టు చేసినట్లు ఫేక్ పోస్టర్ తయారు చేసి ఫేస్‌బుక్‌లో షేర్ చేయడం తగదన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్య తీసుకోవాలన్నారు. ఈ విషయంపై తాము పోలీసు అధికారులకు ఫిర్యాదు చేస్తాన్నామన్నారు. మట్టి మాఫియాకు వ్యతిరేకంగా పోరాటం జరుగుతుందని ప్రకటనలో స్పష్టం చేశారు.

ఎపిజిఇఎ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను సంఘ నాయకులు విడుదల చేశారు. మంగళవారం స్థానిక ఎపిజిఇఎ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎపిజిఎ అధ్యక్షులు ఎన్‌వివి.ప్రసాద్ మాట్లాడారు. జూన్ 3వ తేదీన విజయవాడలో జరుగుతున్న కౌన్సిల్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంజయ్‌కుమార్, లోవరాజు, సంజయ్, స్రవంతి, సతీష్, అపర్ణ, వీరబాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కరపలో భారీ వర్షం

ప్రజాశక్తి - కరప

కరపలో మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షంతో రోడ్లు, డ్రైనేజీలు వర్షపు నీరుతో నిండిపోయాయి. 42.6 వర్షపాతం నమోదు అయినట్లు తహశీల్దార్ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఈ భారీ వర్షంతో ఎంపిడిఒ కార్యాలయం యథావిధిగా ముంపునకు గురైంది. లక్షలు వెచ్చించి ఇటీవల ఆధునీకరణ పనులు చేపట్టిన సమస్య మొదటికి వచ్చింది. దీంతో నీటిని బయటికి తోడేందుకు అధికారులు మోటర్లు తెప్పించి మధ్యాహ్నానికి పూర్తిగా బయటకు తోడించారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసిన వర్షపు నీరు నిలిచిపోవడంతో అధికారులు చేసిన పనులపై నాయకులు, స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 431 మి.మీ వర్షపాతం

ప్రజాశక్తి - కాకినాడ

గడిచిన 24 గంటలలో జిల్లాలో 20.5 మిమీ సగటుతో మొత్తం 431.0 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. మండలాల వారీగా నమోదు అయినా వర్షపాతం వివరాలు..కాకినాడ (పట్టణ) 72.4, కాకినాడ (గ్రామీణ) 55.2, పెదపూడి 50.4, కరప 42.6, యు.కొత్తపల్లి 34.4, తాళ్లరేవు 28.2, కాజులూరు 26.4, సామర్లకోట 22.2, పిఠాపురం 19.2, గొల్లప్రోలు 15.6, రౌతులపూడి 14.8, పెద్దాపురం 12.2, గండేపల్లి 7.2, తుని 6.0, కిర్లంపూడి 5.2, ప్రత్తిపాడు 4.8, జగ్గంపేట 4.6, తొండంగి 3.6, కోటనందూరు 3, ఏలేశ్వరం 2.2, శంఖవరం 0.8 మి.మీ ల చొప్పున వర్ష పాతం నమోదు అయింది.

అపరిచిత వ్యక్తులపై సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

కాలనీలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సిఐ వైఅర్‌కె.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను కలుసుకుని మాట్లాడారు. గ్రామాల్లో జూద క్రీడలు నిర్వహించినా, గంజాయి వంటి వాటిని ఎవరైనా సేవించినా, అమ్మినా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మరిడమ్మను దర్శించుకున్న జడ్జి బుల్లెమ్మ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారిని మంగళవారం పెద్దాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ ఆశాధులు, వేద పండితులు, పూజారులు ఆలయ మర్యాదలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదాశీర్వచనాలతో తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ప్రసాద శర్మ, వేద పండితులు వెంకట శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయి నాని పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తుమ్మలపల్లి రమేష్ నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ సాయం

ప్రజాశక్తి - కాకినాడ

వైద్యం, విద్యకు రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) ఛారిటబుల్ ట్రస్ట్ అండగా నిలుస్తోంది. మంగళవారం డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఆవరణలో ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో సుమారు రూ.1.25 లక్షల విలువ చేసే సాయాన్నిఅందించారు. ఎంబిఎ చదువుతున్న విద్యార్థికి ల్యాప్‌టాప్, డిగ్రీ చదువుతున్న నలుగురు విద్యార్థులకు స్కాలర్, మధుమేహ వ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల బాబుకు 3 నెలలకు సరిపడ మందులు, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఒక మహిళకు 3 నెలలకు సరిపడ్డ మందులను ప్రముఖ ఆడిటర్, రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థి తాళ్లూరి శ్రీనువాసు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యానికి సంబంధించిన సేవా కార్యక్రమాలకు ట్రస్ట్ ప్రాముఖ్యత ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఎన్.కళ్యాణి, ఎ.సరళ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు అంగన్‌వాడీల మద్దతు

ప్రజాశక్తి - సామర్లకోట

వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

మంగళవారం జరగవలసిన సమ్మె వాయిదా పడిందని, జూలై 9వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొంటారని తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డికి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సెక్రటరీ వడ్డి ఎస్తేరురాణి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికవర్గంపై బానిసత్వాన్ని రుద్దటానికి 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని దేశవ్యాప్త సమ్మె చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ పేట సెక్టార్ లీడర్ ఎ.వాణిదేవి, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో రైతుల గుండెల్లో గుబులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలో మంగళవారం కురిసిన వర్షానికి రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఆరుగాలం పండించిన పంట చేతికందే సమయంలో వర్షం రూపంలో వచ్చి పంటను నాశనం చేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని శివారు భూములు సీతానగరం, బలబద్రం ప్రాంతాల్లో వరి పంట కోతలు జరుగుతున్నాయి. కొన్ని వరి పనులు, వరి కుప్పలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. ప్రతిసారి పంట చేతికొచ్చే సమయానికి వర్షం కారణంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

అనధికార లేఔట్లలో హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

నగర పంచాయతీ పరిధిలో అనాధికార లే అవుట్లును గుర్తించి అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు పట్టణ పరిధిలో 23 అనధికార లేఅవుట్లను గుర్తించినట్లు టౌన్ ప్లానింగ్ అధికారి నీలిమదీప్తి తెలిపారు. అనధికార లేఅవుట్‌లలో స్థలాలు, ప్లాట్లు కొనుగోలు చేయుట చట్ట విరుద్ధమని, నిబంధనలు ప్రకారం ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవని ఆమె తెలిపారు. అనధికారంగా నిర్మాణాలు చేపట్టిన యెడల తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - జగ్గంపేట

సినీహీరో జూనియర్ ఎన్‌టిఆర్ 42వ పుట్టినరోజు వేడుకను మంగళవారం స్థానిక నాగేశ్వర థియేటర్ వద్ద, టిడిపి యువ నాయకులు పాలచర్ల నాగేంద్రచౌదరి ఆధ్వర్యంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం పాల్గొని కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు పీలా మణికంఠ, గద్దె కిషోర్, అల్లు సాయిరాం, సందక ప్రసాద్, మైపాల సుధా, తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్ఎస్‌లో మెరిసిన రైతుబిడ్డ

-ఏకలవ్య సాధనతో లవకుమార్ విజయం

కుటుంబ సభ్యులతో లవకుమార్

ప్రజాశక్తి - రౌతులపూడి

అది మెట్టలోని ఓ మారుమూల పల్లె. 80 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇందులో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. ఇలాంటి సన్నకారు రైతు కుటుంబంలో జన్మించిన బాలుడు.. నేడు ఐఎఫ్ఎస్‌లో మెరిశాడు. దీంతో ఒక్కసారిగా ఆ ఊరు పేరు వార్తల్లోకి ఎక్కింది. ఇదే రౌతులపూడి మండలంలోని ములగపూడి. ఈ గ్రామానికి చెందిన చింతకాయల లవకుమార్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్)కు ఎంపిక య్యాడు. ఆయన తండ్రి చింతకాయల వీరసర్వచక్రవర్తి, తల్లి వీరవరాహాలు సాగు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. వారు కష్టపడుతూ పిల్లలు లవకుమార్, స్వాతిలను చదివించారు. లవకుమార్ బివిఎస్‌సి చేయగా అతని సోదరిని డిఎడ్ చేసింది. లవకుమార్ ఒకటి నుంచి 3వ తరగతి వరకూ ములగపూడిలోనే చదవుకున్నాడు. అనంతరం గ్రామానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న రిఫరల్ పాఠశాలలో 4 నుంచి 8వ తరగతి వరకూ విద్యనభ్యసించాడు. 9, 10 తరగతులు తునిలోని శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో, ఇంటర్మీడియట్ విజయవాడ చైతన్య జూనియర్ కళాశాలలో చదివాడు. అనంతరం వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో బివిఎస్‌సి చేశాడు. అనంతరం వెటర్నరీ డాక్టర్‌గా వైద్యసేవలు అందించారు. సంచార పశువైద్యశాలలో సేవలందించాడు. నేటి యువత మొబైల్‌కు బానిసై నిత్యం సోషల్‌మీడియాలో విహరిస్తూ సమయాన్ని వృథా చేసుకుంటారు. కాని లోవకుమార్ మాత్రం ఉద్యోగం సాధించినా ఏకలవ్య దీక్షతో ఎపిపిఎస్‌సికి ప్రిపేర్ అయ్యాడు. ఎలాంటి కోచింగ్ లేకుండానే ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పరీక్షలకు హాజరై విజయం సాధించాడు. ఇటీవల విడుదల చేసిన ఎపిపిఎస్‌సి ఫలితల్లో 49వ ర్యాంకు సాధించి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో ఉద్యోగం సాధించాడు. దీంతో ఆ రైతుకుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

డాక్టర్ యనమదలకు తపన సేవా పురస్కారం

ప్రజాశక్తి - కాకినాడ

ఆరోగ్య విజ్ఞాన రచనల ద్వారా ప్రజారోగ్య రంగంలో విశేష కృషి చేస్తున్న ప్రముఖ వైద్యులు యనమదల మురళీకృష్ణకు సత్యసాయి జిల్లా హిందూపురంకు చెందిన తపన సాహిత్య వేదిక 'సేవా పురస్కారం' ప్రకటించింది. తపన సాహిత్య వేదిక వ్యవస్థాపకులు, ప్రముఖ మాండలిక రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి ప్రతి ఏటా తెలుగులో ఉత్తమ రచనలకు సడ్లపల్లె కథా పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో కోవిడ్, ఎయిడ్స్ పీడలపైనా, ఇటీవల కాలంలో పెరిగిపోతున్న గుండెజబ్బుల పైనా తన రచనల ద్వారా ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పిస్తూ, భరోసానిస్తున్న డాక్టర్ యనమదల మురళీకృష్ణను ఈ ఏడాది సేవా పురస్కారం కొరకు ఎంపిక చేసినట్టు తెలిపారు. డాక్టర్ మురళీకృష్ణ 2000 సంవత్సరంలో ఎయిడ్స్ పుస్తకాన్ని ప్రచురించారు. 2022లో కోవిడ్ ఎయిడ్స్ నేను, 2024 మే నెలలో హెచ్ఐవి ఎయిడ్స్, జూన్ నెలలో హెచ్ఐవి ఎయిడ్స్ ఇన్ ఇండియా అండ్ డెవలపింగ్ కంట్రీస్ పుస్తకాలను వెలువరించారు. దాదాపు అన్ని ప్రధాన పత్రికలలోనూ, సామాజిక మాధ్యమాలలో, టీవీ మాధ్యమం ద్వారా సాధికార ఆరోగ్య విశేషాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కోవిడ్ పీడ సమయంలో డాక్టర్ మురళీకృష్ణ విశ్లేషణలు, ఇంటర్వ్యూలు ప్రజలకు కొండంత భరోసానిచ్చాయి. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, గంటేడ గౌరు నాయుడు, డాక్టర్ దేవేంద్ర ఈ అవార్డుల ఎంపికకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ ఏడాది జూన్ 22న హిందూపురంలో జరిగే కార్యక్రమంలో ఈ మురళీకృష్ణ ఈ అవార్డును స్వీకరించనున్నారు.

నేడు జరిగే యుటిఎఫ్ ధర్నా వాయిదా

ప్రజాశక్తి - కాకినాడ

డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం జరగాల్సిన ధర్నా కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు యుటిఎఫ్ నాయకులు ఐ.ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో జరిగిన చర్చలో కొన్ని అంశాల్లో సానుకూల స్పందన రావడంతో ఉద్యమ కార్యాచరణ వాయిదా వేసినట్లు తెలిపారు.

ఎస్ఐ సతీష్‌కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి - కిర్లంపూడి

ఎస్ఐని సత్కరిస్తున్న డిఎస్‌పి

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభను చాటుకున్న ఎస్ఐ జి.సతీష కుమార్‌ను ఘనంగా సత్కరించారు. స్టేషన్‌లో నమోదు అయిన కేసులను త్వరితగతిన పరిష్కరించి, జిల్లాలో అతి తక్కువ కేసుల నమోదు అయిన పోలీస్‌స్టేషన్‌గా కిర్లంపూడి స్టేషన్ గుర్తింపు పొందింది. మంగళవారం ఎస్ఐ సతీష్‌కుమార్‌తోపాటు, సిబ్బందిని డిఎస్‌పి శ్రీహరి రాజు, సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు.

గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

ప్రజాశక్తి - సామర్లకోట

గోతులు పూడ్చుతున్న పోలీసులు

సామర్లకోట - కాకినాడ రోడ్డులోని రైల్వే గేట్ సమీపంలో ప్రధాన రహదారికి పడిన గుంతలను ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు ఆధ్వర్యంలో పోలీసులు సిబ్బంది పూడ్చారు. మంగళ వారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున వర్షం కురుస్తుండడంతో రైల్వే గేటు వద్ద గుంతలలో పెద్ద ఎత్తున వర్షం నీరు చేరి గుంతలు కనిపించకుండా ప్రమాదకరంగా మారాయి. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతూ వాహనదారులు ఆ గుంతల్లో పడిపోవడంతో ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు ఆధ్వర్యంలో సిబ్బంది గోతులు పూడ్చి ప్రయాణికుల మన్ననలను పొందారు.

50 రాయితీతో క్రమబద్ధీకరణకు అవకాశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

గృహ విద్యుత్ వినియోగదరులకు అదనపు లోడును 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎఇ రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 రాయితీతో వన్ కిలో వాట్ రూ.1250, 2 కిలో వాట్ రూ.2450, 3 కిలో వాట్ రూ.3650, 4 కిలో వాట్ రూ.4850, 5 కిలో వాట్ రూ.6050 చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చనని తెలిపారు.

నేడు వృద్ధాప్య పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాంలోని మత్స్యకారులకు సంబంధించి బుధవారం వృద్ధాప్య పింఛన్లను పంపిణీ చేయనున్నట్టు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన 278 మందికి స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో పింఛన్‌ను అందిస్తామని తెలిపారు.

పుట్టిన తేదీ ధ్రువీకరణ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నేను పట్యం సాయిరామ్, తండ్రి: అప్పారావు, తల్లి: పట్యం సరోజిని, డో.నెం. 15-4-16/2, బాపూజీ నగర్, కొవ్వూరు, తూ॥గో॥జిల్లాకు చెందిన దంపతులకు 27-07-1953వ సంవత్సరంలో 3వ కుమారుడుగా జన్మించి ఉన్నాను. ఈ తేదీ నాయొక్క SSLC సర్టిఫికెట్ ననుసరించి ధ్రువీకరించబడినది. కావున నా జనన తేదీ ధ్రువీకరణపై ఎవరికైన ఏవిధమైన అభ్యంతరములున్నా నేటి నుండి 7 రోజుల లోపుగా కొవ్వూరు RDO ఆఫీసు నందు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

పట్యం సాయిరామ్
S/o. పట్యం అప్పారావు, బాపూజీ నగర్, కొవ్వూరు, సెల్. 8179516055

పాస్‌పోర్ట్ పడిపోయినది

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం, గొంది గ్రామానికి చెందిన కొప్పాడి దశరధుడు S/o. సుబ్బరాజు లు చెందిన నెంబరు **G 6836914** గల పాస్‌పోర్ట్ పడిపోయినది. ది. 17-04-2025 తేదీన పాస్‌పార్ట్‌ను జిరాక్స్ తీయించుకునే నిమిత్తం ఇంటి వద్ద నుండి సఖినేటిపల్లి సెంటర్‌కు మోటారు సైకిల్‌పై వెళ్ళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

కొప్పాడి దశరధుడు
S/o. సుబ్బరాజు, డో.నెం. 1- 17
గొంది గ్రామం, సఖినేటిపల్లి మండలం

పత్రికా ప్రకటన

కీ॥శే॥ పట్టా తిరుపతిరావు (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, ఎస్.యానం, శ్రీరామ్ నగర్ గ్రామం, డో.నెం. 1-94 కాపురస్తులు పట్టా తిరుపతిరావు (లేటు), S/o. గంగరాజు (లేటు) గారి భార్య పట్టా లక్ష్మి ఇచ్చిన పత్రికా ప్రకటన.

నా భర్త **పట్టా తిరుపతిరావు గారు** ఎస్.యానం గ్రామంలో మా ఇంటి వద్ద 25-04-2006 సం॥రంలో మరణించారు. వీరి మరణం ఎస్.యానం గ్రామపంచాయతీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: **పట్టా లక్ష్మి**
W/o. పట్టా తిరుపతిరావు (లేటు), డోర్ నెంబర్: 1-94,
ఎస్.యానం, శ్రీరామ్‌నగర్ గ్రామం
ఉప్పలగుప్తం మండలం, సెల్: 7799110126

మహారాజశ్రీ చోడవరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 139 / 2023

__బిట్వీన్:__
లెక్కల రామలక్ష్మి వగైరాలు . . . వాదులు
__అండ్:__
లెక్కల వేణుగోపాల్ వగైరాలు ... ప్రతివాదులు
టు:
__డి-5:__ సబ్బవరపు గంగాభవాని, W/o.అప్పలనాయుడు,D/o.లేటు ఎర్రునాయుడు @ చిట్టిబాబు @ చిట్టినాయుడు, డో.నెం. 3/79/1, వివేకానందనగర్, Near ఎండాడ పెట్రోల్ బంక్, గీతం పోస్టు, విశాఖపట్నం.
__డి-6:__ బర్ల కృష్ణవేణి, W/o. లేటు రాంబాబు D/o.లేటు ఎర్రునాయుడు @ చిట్టిబాబు @ చిట్టినాయుడు, సా॥ పి.తిమ్మాపురం గ్రామం పిఠాపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా. (ప్రస్తుతం కాకినాడ జిల్లా)

పై నెంబర్న వాద్లు ప్రతివాదలుపైని పంపకం దావాదాఖలు చేయగా 5@6 ప్రతివాదులుకి సమన్లు సర్వు నిమిత్తం తే:19-6-2025 దీకి దావా వాయిదా వున్నది. అయితే పై నెంబరు దావాలో మీకు ఎట్టి ఆక్షేపణలు ఉన్ననూ మీరు __తే: 19-6-2025దీ ఉదయం 10-30కి__ మీరు స్వయంగా గాని, లాయరుగాని ద్వారా గాని, పై కోర్టులో హాజరుఅయి తెలియపర్చు కోవలెను. లేననియెడలా మీ పరోక్షమందు తదుపరి ఉత్తర్వులు జారీ చేయడమగును అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

Chodavaram
Dt. 20-5-2025

P.PRAKASA RAO
Advocate, Chodavaram
Visakhapatnam.
Cell : 94410 19918

పత్రికా ప్రకటన

కీ॥శే॥ పెమ్మాడి అప్పారావు (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, ఎస్.యానం, శ్రీరామ్ నగర్ గ్రామం, డో.నెం. 1-94 కాపురస్తులు పెమ్మాడి అప్పారావు (లేటు), S/o. కొండయ్య (లేటు) గారి భార్య పెమ్మాడి సీత ఇచ్చిన పత్రికా ప్రకటన.

నా భర్త **పెమ్మాడి అప్పారావు గారు** ఎస్.యానం గ్రామంలో మా ఇంటి వద్ద 25-08-2017 సం॥రంలో మరణించారు. వీరి మరణం ఎస్.యానం గ్రామపంచాయతీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: **పెమ్మాడి సీత**
W/o. పెమ్మాడి అప్పారావు (లేటు), డోర్ నెంబర్: 1-94,
ఎస్.యానం, శ్రీరామ్‌నగర్ గ్రామం
ఉప్పలగుప్తం మండలం, సెల్: 7799110126